క్లుప్తంగా

వైభవ వేంకటేశ్వరుడికి నేడు సుప్రభాత సేవ




మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

తల్లి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు


ఆదిలక్ష్మి

మర్రిపాలెం: తన తల్లి కనిపించడం లేదని ఆమె కుమార్తె ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం బర్మాక్యాంప్ దరి ఏఎస్సార్ నగర్‌లో కర్రి ఆదిలక్ష్మి(66) తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 14 నుంచి ఆమె కనిపించడం లేదు. చుట్టుపక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో ఆదిలక్ష్మి కుమార్తె సూర్యకుమారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయి సందర్శనకు వెళ్లినప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో విధిగా నమోదు చేసి వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాక్సిన్, ఓపీ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధంగా బుధవారం హెడ్ క్వార్టర్‌లోను, శనివారం పీహెచ్‌సీ పరిధిలో వ్యాక్సినేషన్ వేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాన్నంతా పరిశీలించారు. పీహెచ్‌సీ కొత్త భవనం సివిల్ వర్క్స్ కోసం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..



నక్కవానిపాలెం మెయిన్ రోడ్డులో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు, ఆటో

- యథేచ్ఛగా రాంగ్ రూట్‌లో ప్రయాణాలు
- నిబంధనలు పట్టని వాహన చోదకులు

సీతమ్మధార: రాంగ్ రూట్‌లో ప్రయాణం ప్రమాదమని తెలిసినా.. ప్రమాదాలు జరుగుతున్నా కొందరి వాహన చోదకుల తీరు మారడం లేదు. దగ్గర మార్గమనో లేదా ఇతర కారణమో గానీ ట్రాఫిక్ నిబంధనలు మీరి రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ప్రధానం రహదారిలో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద జంక్షన్‌లో అటూ.. ఇటూ రాంగ్ రూట్ ప్రయాణాలు నిత్యం జరుగుతున్నాయి. నక్కవానిపాలెం నుంచి కేఎస్‌ఆర్ కాంప్లెక్స్ రోడ్డుకు వెళ్లే వాహనాలు, సీతమ్మధార రైతుబజార్ నుంచి వచ్చిన వాహనాలు నక్కవానిపాలెం రోడ్డు మీదుగా సత్యం జంక్షన్ వైపు వెళ్తుంటాయి. అటువైపు ప్రయాణించే వాహనాలకు రాంగ్ రూట్‌లో వచ్చిన వాహనాలు ఎదురుగా రావడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసుల జాడ ఎక్కడా కనిపించడం లేదని పలువురు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి నక్కవానిపాలెం మెయిన్ రోడ్డులో ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించి, రోడ్డు ప్రమాదాలు, రాంగ్ రూట్ ప్రయాణాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి పాత్రల శుభ్రతతో దోమల కట్టడి


ఎన్జీజీవోస్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


శ్రీనివాసనగర్‌లో అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 26, 43 వార్డుల్లో శుక్రవారం జిల్లా మలేరియా సబ్‌యూనిట్ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది ఫ్రైడే-డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కయ్యపాలెం, ఎన్జీజీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్, నందగిరినగర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో మహిళలకు దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మలేరియా సూపర్‌వైజర్లు సత్యానంద్, శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజులు దాటి వర్షపు నీరు, లేదా తాగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు శుభ్రపర్చి మళ్లీ పట్టుకోవాలని సూచించారు. నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది శివ పాల్గొన్నారు.

డాక్టర్ రవికి సత్కారం


డాక్టర్ రవిని సత్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తదితరులు

మహారాణిపేట: ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్న ఆంధ్రా మెడికల్ కాలేజీ దేశ, విదేశాల్లో స్థిర పడ్డ పూర్వ విద్యార్థులను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ రవి సిరిపురపు (1991), డాక్టర్ సురేష్ కంకణాల (1992) సెంటినరీ అల్యూమినా బ్లాక్ కోసం సహకరిస్తున్నారు. శుక్రవారం డాక్టర్ రవి సిరిపురపు ఆంధ్రా మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి సిరిపురపును ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజుతో పాటు ఇతర సీఏబీ సభ్యులు డాక్టర్ ఇ.పెదవీర్రాజు, డాక్టర్ పి.వి. సుధాకర్, డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు, డాక్టర్ అపరంజి, డాక్టర్ ఎస్.ఎన్.ఆర్.నవీన్ తదితరులు సత్కరించారు.

ఘోషా ఆస్పత్రి వద్ద రూ.10కే భోజనం


రూ.10కే భోజనం అందిస్తున్న రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు

జగదాంబ: క్వీన్ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రి వద్ద స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ, రౌండ్ టేబుల్ సంస్థలు సంయుక్తంగా రూ.10కే భోజనం అందిస్తున్నాయి. దూర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వచ్చే వారికి సేవ చేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ తెలిపారు. అంతే కాకుండా ఎండలు ఎక్కువ ఉన్న కారణంగా భోజనంతో పాటు ఆ పది రూపాయలకే పోషక విలువలు కలిగిన రాగి జావా కూడా అందిస్తున్నామన్నారు.

దీనిపై ప్రజలు, పేషెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు డి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో పంట పండింది


హాస్టల్‌లో చెట్టుకు కాసిన మామిడి కాయను వీసీ ప్రసాదరెడ్డికి బహూకరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం విదేశీ విద్యార్థినుల హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు స్వయంగా పలు మొక్కలు నాటి పెంచుతున్నారు. గత సంవత్సరం కొన్ని మామిడి మొక్కలు నాటారు. ఈ సంవత్సరం వీటిలో ఒక మొక్క కాయలు కాయడం ప్రారంభించింది. ఈ మేరకు మొక్కకు కాసిన కాయను పలువురు వియత్నాం విద్యార్థులు ప్రత్యేకంగా తీసుకువచ్చి వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి బహూకరించారు. వియత్నాంకు చెందిన పరిశోధకులు, విద్యార్థులు స్వయంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను హాస్టల్ ఆవరణలో సాగు చేస్తున్నారు. తమ దేశానికి సంబంధించిన పలు మొక్కలు సైతం తీసుకువచ్చి ఇక్కడ హాస్టల్ చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో పెంచుతున్నారు. వారి ఆసక్తిని వీసీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ అర్చకులు గిరి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈఆర్ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కార్మికవర్గం చురుగ్గా పాల్గొవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాజు కోరారు. ప్రైవేటీకరణ ఉద్యమం ప్రారంభం నుంచి ఐఎన్‌టీయూసీ చురుగ్గా వ్యవహరిస్తోందన్నారు. శుక్రవారం జరిగిన ఎలక్ట్రికల్ రిపేర్ షాప్ (ఈఆర్ఎస్) నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విభాగం నూతన కన్వీనర్‌గా పి.వి.రాజు, అధ్యక్షునిగా కె. అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, పి.ఎస్.ఎస్. ప్రసాద్, బి. శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సురేష్, సహాయ కార్యదర్శిగా కె. అప్పలరెడ్డి, కోశాధికారిగా ఎ. నరేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ప్రధాన కార్యదర్శి బీఎస్ రాజును నాయకులు సత్కరించారు.

41వ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా 41వ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా నగరంలోని ఆర్యవైశ్యులు అందించిన విరాళాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒకసారి ఒక పెళ్లి సంబంధం చూడడానికి సమయం, ధనం ఎక్కువగా ఖర్చవుతుందని, కానీ ప్రస్తుత జీవన విధానంలో ఈ విధమైన వధూవరుల పరిచయ సభల వల్ల ఒకేసారి ఎక్కువ మంది నుంచి తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే అవకాశం ఉన్న ఇటువంటి కార్యక్రమాన్ని ఆధునిక స్వయంవరాలుగా అభివర్ణించవచ్చని పేర్కొన్నారు. ఈ పరిచయ కార్యక్రమం ఆర్యవైశ్యులకు మాత్రమేనని, పరిచయ వేదికలో పాల్గొనే వారు వచ్చే నెల 27లోగా నగదు/ఫోన్‌పే/మనియార్డర్ ద్వారా సంఘ కార్యాలయంలో సంప్రదించి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7780149250 నంబరులో సంప్రదించవచ్చు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పూసర్ల సురేష్‌కుమార్, పరిచయ వేదిక ఉప సంఘం చైర్మన్ దుర్గా సోమేశ్వరరావు, పాలూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


అలంకరణలో దుర్గమాంబ

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గాదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల కమిటీ సభ్యులు, సేవా దళం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వికసించిన ఫ్లేమింగ్ టార్చ్


స్థానిక రాణిచంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనంలో అరుదైన ఫ్లేమింగ్ టార్చ్ పుష్పం విరబూసింది. బిల్‌బెర్జియా పిరమిడాలిస్‌గా వ్యవహరించే ఈ పుష్పం ఎంతో ఆకట్టుకుంటోంది. పార్కును సందర్శించే విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తోంది. - ఏయూ క్యాంపస్

60వ వార్డులో జీవీఎంసీ కమిషనర్ పర్యటన


స్థానిక సమస్యలపై ఆరా తీస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మల్కాపురం: జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ శుక్రవారం ఉదయం 60వ వార్డులో ఆకస్మికంగా పర్యటించారు. వుడా కాలనీ ఎంఐజీ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. విశాలమైన ఈ మైదానాన్ని ఎందుకు నిర్లక్ష్యంగా విడిచిపెట్టారని, దీనిని తక్షణం ఆధునికీకరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలోని బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించారు. ఇళ్ల ముందు చెత్త డంప్‌చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. వ్యర్థాలను నిర్లక్ష్యంగా రోడ్డుపై వేయడం వల్ల కలిగే నష్టాలను, తడి, పొడి చెత్తను వేరు వేరుగా ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై జనంలో అవగాహన తీసుకురావాలని సూచించారు. అనంతరం మల్కాపురం నుంచి జింక్ వరకు సర్వీస్ రోడ్డులో భూగర్భ పైప్‌లైన్ కోసం తవ్విన గోతులను జీవీఎంసీ కమిషనర్ పరిశీలించారు. వెంటనే వాటిని పూడ్చాలని ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


25వ వార్డులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి శుక్రవారం ఉదయం ఆయన సీతంపేట హరిజన వీధి, కనకమ్మ వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నివాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్, పారిశుధ్యం, రేషన్ కార్డుల మంజూరు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ తెలియపర్చారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ అడ్మిన్ రాజశేఖర్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం


కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు అఘోర మృత్యుంజయ పాశుపత అభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమావాస్య సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ


బాలికలకు జేవీకే కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ హైస్కూల్, కేఎస్‌ఎం గరల్స్ హైస్కూళ్లలో శుక్రవారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, హెచ్‌ఎంలతో కలిసి విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల చదువును తన భుజాన వేసుకుని వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు, మూడు జతల యూనిఫారాలు, కుట్టుకూలితో సహా ఒక జత షూస్, రెండు జతల సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగ్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లు స్కూల్ తెరిచిన తొలి రోజు నుంచే అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బులుసు జగదీష్, ఎస్.ప్రసాదరావు, నూకరాజు, రమణమర్తి, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, గోపి, ప్రకాష్, కనకమహాలక్ష్మి, స్వర్ణ, కృష్ణవేణి, రియాజ్, సచివాలయ సిబ్బంది, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

చికిత్సతో వంకర పాదాలు నయం


మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

మహారాణిపేట: పుట్టుకతోనే వంకర పాదాలతో ఉన్న పిల్లలకు సరైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వంకర పాదాల చికిత్సపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పాదాలు వంకరగా ఉన్నాయని భయపడొద్దని తెలిపారు. పలు చికిత్సా విధానాల ద్వారా పాదాలను పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ వంకర పాదాలపై వైద్యులకు కూడా అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, రాణిచంద్రమతి దేవి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బి.చక్రవర్తి, డాక్టర్ రుద్ర ప్రసాద్, డాక్టర్ అభిషేక్ తదితరులు కార్యక్రమానికి శిక్షకులుగా వ్యవహరించారు. క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు రీజనల్ మేనేజర్ పి.రవికుమార్, స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బి.శిరీషరాణి, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జి.జోత్స్న, డాక్టర్ వి.వి. సమత, పి.ప్రియాంక, బి.సాయి కిరణ్, ఇ.శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు. అవసరం అయిన వారు (8800020503) నంబర్‌కు కాల్ చేస్తే చికిత్స అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

పబ్లిక్ డిమాండ్

కూలిన చెట్టు.. రాకపోకలకు ఇక్కట్లు


టీపీటీ కాలనీ రోడ్డులో అడ్డంగా కూలిన చెట్టు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలో రెండు రోజుల కిందట వీచిన ఈదురు గాలులకు ఓ చెట్టు కూలిపోయింది. అది రోడ్డు మధ్యలో పడి ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకల సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత వరకు సంబంధిత అధికారులు, సిబ్బంది కూలిన చెట్టును తొలగించ పోవడంతో కాలనీ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చెట్టును తక్షణం తొలగించాలి.

– అరుణ్, టీపీటీ కాలనీ

నీరు లేక ఎండిపోతున్న మొక్కలు


కంచరపాలెం నేతాజీ వంతెనపై ఏర్పాటు చేసిన మొక్కలు

కంచరపాలెం: కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనపై ఏర్పాటు చేసిన పూల కుండీల్లోని మొక్కలు నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. జీవీఎంసీ జోన్-5 పరిధిలో హార్టికల్చర్ సిబ్బంది పూల కుండీల్లో మొక్కలకు నీరు పోయడం లేదు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎండలకు మొక్కలు వాడిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలకు నీరు పోసేలా చర్యలు తీసుకోవాలి.

– పిన్నింటి భరత్‌కుమార్, గొల్ల కంచరపాలెం